# సాక్షి విశాఖపట్నం

సోమవారం । 27 । నవంబర్ । 2023






**జూకు కార్తీక శోభ**

జూ పార్కులో ఆదివారం సందడి నెలకొంది. కార్తీక మాసం రెండో ఆదివారం కావడంతో ఆరు వేలకు పైగా జూను సందర్శించారు. 8లో



**మాల్‌లో భారీ అగ్ని ప్రమాదం**

తగరపువలస మెయిన్‌రోడ్డులోని మూడు అంతస్తుల్లో ఉన్న జశ్వంత్ రడీమేడ్స్ షాపింగ్ మాల్ ఆదివారం అగ్నికి ఆహుతైంది. 8లో



**ముగిసిన స్వాభిమాన ఉత్సవాలు**

గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణా మిషన్ భవన్‌లో నిర్వహిస్తున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. 8లో

## న్యూస్‌రీల్

### నేవీ డేకు ఏర్పాట్లు షురూ..



బీచ్‌రోడ్డులో జరుగుతున్న ఏర్పాట్లు

**బీచ్‌రోడ్డు:** నౌకాదళ దినోత్సవం పురస్కరించుకుని తూర్పు నౌకాదళం ఆదివారం బీచ్‌రోడ్డులో ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ నెల 28, 30వ తేదీల్లో రిహార్సల్స్, డిసెంబర్ 2న ఫైనల్ రిహార్సల్స్ చేయనున్నారు. డిసెంబరు 4న జరిగే ప్రధాన వేడుకకు నేవీ ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరవుతారు. ఈ వేడుకలను తిలకించేందుకు వేల సంఖ్యలో ప్రజలు సాగరతీరానికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్, గ్యాలరీలను సిద్ధం చేస్తున్నారు. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ప్రధాన వేదికను తీర్చిదిద్దుతున్నారు.

### షిప్‌యార్డ్‌లో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

**సింధియా:** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని షిప్‌యార్డ్ ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని సీఎండీ హేమంత్‌ఖత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు, గుర్తింపు యూనియన్ నాయకులు, ట్రేడ్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎన్నికల జాబితా పరిశీలకుడు రాక

**మహారాణిపేట:** ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్నికల జాబితా పరిశీలకుడుగా (రోల్ అబ్జర్వర్) నియమితులైన ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు సోమవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 9 గంటలకు విమానాశ్రయానికి చేరుకొని జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. పోలింగ్ కేంద్రాలను ఓటరు జాబితాలను తనిఖీ చేస్తారు. అనంతరం విజయనగరం వెళ్తారు. ఈనెల 29 పార్వతీపురం పర్యటన అనంతరం విశాఖ జిల్లాకు చేరుకుంటారు. ఆరోజు సాయంత్రం 3.30 నుంచి 4.30 వరకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు.

### 28న దిశ సమావేశం

**మహారాణిపేట:** కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 28న జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ(దిశ) కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిర్వహణపై కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శాఖల వారీగా సమీక్షించనున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, దిశ కమిటీ సభ్యులు హాజరు కానున్నారని.. అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధం కావాలని సూచించారు.

## వైభవంగా జ్వాలా తోరణం



కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ జ్ఞానలింగేశ్వర ఆలయం, పీతలవానిపాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో జ్వాలా తోరణ మహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ జ్ఞానలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు ఆరవెల్లి సూర్యప్రకాశ్ శర్మ, ఆధ్వర్యంలో భక్తులు విశేష అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఉపవాసం ఉన్న మహిళలు సాయంత్రం ఆలయానికి తరలివచ్చి ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. అనంతరం జ్వాలా తోరణ మహోత్సవం నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి.. మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. వెలుగుతున్న జ్వాలా తోరణం కింద బూడిదను నుదుటిన పెట్టుకున్నారు. భక్తుల శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. హెచ్‌బీకాలనీ, ఇసుకతోటలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. - మద్దిలపాలెం

## ఆశాకిరణం లాంగ్‌లైనర్



లాంగ్‌లైనర్ బోటు

- సాధారణ మత్స్యకారులకు 50 శాతం రాయితీ
- బోటు ప్రమాద బాధితులకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ
- వీటి కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణ సదుపాయం
- ఈ బోట్లతో ఆదాయం పెంపునకు దోహదం

**సాక్షి, విశాఖపట్నం :** మత్స్యకారులకు ఆదాయాన్ని తెచ్చి పెట్టే బోట్లలో లాంగ్‌లైనర్లకు పెట్టింది పేరు. సాధారణ చేపల వేటకు మెకనైజ్డ్ (మర) బోట్లను వినియోగిస్తారు. వీటి ద్వారా చేపలతో పాటు రొయ్యల వేట సాగిస్తారు. ఇలాంటి మెకనైజ్డ్ బోట్లు విశాఖలో 690 వరకు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 150 వరకు లాంగ్‌లైనర్ బోట్లున్నాయి. ట్యూనా వంటి పెద్ద చేపల వేట కోసం వీటిని ఉపయోగిస్తారు. మెకనైజ్డ్ బోట్లు సముద్రంలో వలలు వేసి చేపలు, రొయ్యలను, హుక్ (గాలం)ల ద్వారా ట్యూనా చేపలను వేటాడతారు. మెకనైజ్డ్ బోటు ఖరీదు రూ.30 నుంచి 60 లక్షల వరకు ఉంటే.. లాంగ్‌లైనర్ బోటు ఖరీదు రూ.80 నుంచి లక్ష వరకు ఉంటుంది. వీటిలో ఫైబర్‌తో తయారైనది రూ.80 లక్షలు, స్టీల్‌తో తయారు చేసినది రూ.కోటి అవుతుంది. విశాఖ ప్రాంతానికి స్టీల్ లాంగ్‌లైనర్ బోట్లు అనుకూలంగా లేకపోవడంతో ఫైబర్ బోట్లకే మత్స్యకారులు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఆదివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 49 మెకనైజ్డ్ బోట్లు దగ్ధమయ్యాయి. వీటిలో 30 పూర్తిగా, 19 బోట్లు పాక్షికంగా కాలిపోయాయి. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రమాదం జరిగిన మూడు రోజుల్లోనే బోట్లకు వాటిల్లిన నష్టంలో 80 శాతం పరిహారంగా రూ.7.11 కోట్లను సంబంధిత బోటు యజమానులకు చెల్లించింది. ఇలా గరిష్టంగా రూ.32.80 లక్షలు, కనిష్టంగా రూ.2.40 లక్షల సొమ్మును బాధితులకు పంపిణీ చేసింది.

**ప్రయోజనాలివీ..**

ఆదాయాన్ని తెచ్చిపెట్టే లాంగ్‌లైనర్లపై కొన్నాళ్లుగా మత్స్యకారుల్లో ఆసక్తి ఉంది. ఈ బోట్లతో డీప్ సీలో హుక్‌ల ద్వారా వేట సాగిస్తారు. వేటాడిన చేపలు రోజుల తరబడి నిల్వ ఉండేందుకు బోట్లలో ఐదారు టన్నుల ఐస్‌ను తీసుకెళ్తారు. లాంగ్‌లైనర్లలో నీటిని 1–2 డిగ్రీల శీతలీకరణ చేసే సాంకేతికత ఉంటుంది. గడ్డకట్టే ఆ నీటిలో చేపలను నిల్వ ఉంచుకోవచ్చు. అందువల్ల ఇక ఐస్ అవసరం ఉండదు. ట్యూనాలు వంటి ఖరీదైన ఈ చేపల పొట్ట భాగాన్ని తొలగించి వాటిలో ఉంచడం ద్వారా సెష్మీగ్రేడ్ ఫిష్‌గా తయారవుతుంది. వీటికి విదేశాల్లో డిమాండ్ ఎక్కువగా ఉండడం వల్ల మంచి ధర పలుకుతుంది. ఐస్‌కయ్యే పెట్టుబడి కూడా తగ్గుతుంది. మెకనైజ్డ్ బోట్లకంటే లాంగ్ లైనర్‌లకు డీజిల్ వినియోగం తక్కువ. ఇవన్నీ బోటు యజమానికి లాభదాయకమవుతాయి. ప్రస్తుతం విశాఖ నుంచి వేటకు వెళ్లే లాంగ్‌లైనర్ బోట్లకు ఈ సదుపాయం లేదు. కొత్తగా కొనుగోలు చేసే వాటికి శీతలీకరణ సదుపాయం ఉంటుంది. ఇటీవల లాంగ్‌లైనర్ బోట్ల తయారీపై చెన్నైకి చెందిన సంస్థ ప్రతినిధులతో చర్చించామని, రూ.80 లక్షలకు ఫైబర్ బోటు ఇవ్వడానికి ముందుకొచ్చారని, దీనిపై మత్స్యశాఖ ఉన్నతాధికారులకు నివేదించామని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు.

### లాంగ్‌లైనర్ల కొనుగోలుకు చేయూత

లాంగ్‌లైనర్ బోట్ల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై), బ్లూ రివల్యూషన్ పథకాల్లో పురుష మత్స్యకారులకు 50 శాతం, మహిళా మత్స్యకారులకు 60 శాతం వరకు సబ్సిడీగా చెల్లిస్తోంది. వీటిలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 12 శాతం ఉంది. మిగిలిన సొమ్మును బ్యాంకులు రుణంగా ఇస్తాయి. కొంత సొమ్మును లబ్ధిదారుని వాటాగా సమకూర్చుకోవలసి ఉంటుంది. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన మెకనైజ్డ్ బోట్ల యజమానులు ఈ లాంగ్‌లైనర్ బోట్లు కొనుగోలుకు ముందుకు వస్తే వాటికి 75 శాతం సబ్సిడీ చెల్లించేలా త్వరలో జీవో జారీ చేయనున్నట్టు మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వారికి పరిహారం పంపిణీ చేసే కార్యక్రమంలో ప్రకటించారు. స్టీల్ లాంగ్‌లైనర్‌కు రూ.కోటి, ఫైబర్ లాంగ్‌లైనర్‌కు రూ.80 లక్షల వరకు వ్యయం అవుతుంది. విశాఖ వాతావరణానికి స్టీల్ లాంగ్‌లైనర్‌లు అనుకూలం కాదన్న భావన మత్స్యకారుల్లో ఉంది. దీంతో ఫైబర్ బోట్లను కొనుగోలు చేసే వారికి రూ.60 లక్షల వరకు సబ్సిడీ దక్కనుంది. మిగిలిన సొమ్ములో కొంత బ్యాంకులు రుణం ఇస్తాయి. లబ్ధిదారుని వాటాగా బోట్ల పరిహారంగా ఇచ్చిన సొమ్ములో అవసరమైన మేరకు చెల్లిస్తే సరిపోతుంది. సరికొత్త బోటు మత్స్యకారుని సొంతమవుతుంది. ప్రభుత్వం ఇస్తున్న ఈ వెసులుబాటును వినియోగించుకోవాలన్న యోచనలో మత్స్యకారులున్నారు.

## నమో నారసింహా



దీక్ష తీసుకునేందుకు వచ్చిన భక్తులు (ఇన్‌సెట్) మాలధారణ చేస్తున్న అర్చకుడు

- నృసింహ దీక్షలు ప్రారంభం
- 350 మందికి శాస్త్రోక్తంగా మాలధారణ
- డిసెంబర్ 4 నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభం

**సింహాచలం:** శ్రీ నృసింహ దీక్షలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. 41 రోజుల మండల దీక్ష తీసుకునేందుకు వచ్చిన సుమారు 350 మంది దీక్షాధారులకు సింహగిరిపై దేవస్థానం వైదిక, అధికార వర్గాలు శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు. సింహగిరిపై రాజగోపురం పక్కన మాడవీధిలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రతిమలను ఉంచారు. దేవస్థానం అర్చకులు, అధికారులు మేళతాళాలు, వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయం నుంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామి చెంతన తులసి మాలలను ఉంచి అర్చకులు విష్వక్సేన పూజ పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామి అష్టోత్తర శతనామావళిని దీక్షాధారులందరిచేత పఠింపజేశారు. అనంతరం దీక్షాధారులకు మాలధారణ చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ దీక్ష నియమాలను వివరించారు. దేవస్థానం తరఫున ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి దీక్ష వస్త్రాలు, క్షేత్ర పురాణం కరపత్రాలను అందజేశారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు, వేద పండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్ష తీసుకున్నవారిలో సింహాచలం ప్రాంతానికి చందన పెరుమాళ్ పీఠం గురుస్వామి సానబోయిన రాజుతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా, హైదరాబాద్, విశాఖ ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, ముదుండి రాజేశ్వరి, డిప్యూటీ ఈవో సుజాత, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు నరసింహరాజు, రమణమూర్తి, పాలూరి నరసింగరావు, పీఆర్వో నాయుడు, సింహాద్రి మఠం గురుస్వామి కె.సురేంద్రస్వామి పాల్గొన్నారు. కాగా చందన పెరుమాళ్ పీఠం దీక్షాధారులు వరాహ, నృసింహ వేషధారణాల్లో అలరించారు. డిసెంబర్ 4 నుంచి 32 రోజుల నృసింహ దీక్షలు ప్రారంభమవుతాయని స్థానాచార్యులు తెలిపారు. ఆ రోజు కూడా సింహగిరిపై దీక్షాధారణ కార్యక్రమం ఉంటుందన్నారు. జనవరి 6న దీక్ష విరమణ కార్యక్రమం చేపడతామని వెల్లడించారు.

## ఘనంగా రాధాకృష్ణుల మహోత్సవం



పాలు పెరుగు వేస్తూ యదుమేళా చేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మేయర్ హరివెంకట కుమారి



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

**బీచ్‌రోడ్డు:** బీచ్‌రోడ్డులోని గోకుల్ పార్క్ వద్ద గల రాధాకృష్ణ ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాధాకృష్ణుల మహోత్సవం ఘనంగా జరిగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా పాలు, పెరుగుతో యదుమేళాను యాదవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు సాగిన ఈ మహోత్సవంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న భక్తులు పాల్గొని పాలు, పెరుగును రాధాకృష్ణులకు సమర్పించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్వాపరయుగంలో మహా విష్ణువు శ్రీకృష్ణుడిగా జన్మించాడని, ఆయన లీలలు అమోఘమన్నారు. ఆయన గీతోపదేశాన్ని అందరూ పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం గోకుల్ పార్క్ నామకరణ బోర్డును మంత్రి, మేయర్ ఆవిష్కరించారు. జీవీఎంసీ నిధులతో గోకుల పార్క్‌ను అద్భుతంగా తీర్చిదిద్దిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు, రమేష్ యాదవ్ రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు.

## సమష్టి కృషితోనే ప్రమాదాలకు చెక్





ప్రతిజ్ఞ చేస్తున్న సీపీ రవిశంకర్, అధికారులు, హాజరైన రవాణా శాఖ అధికారులు, ఆటో డ్రైవర్లు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల యజమానులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

- రోడ్డు భద్రత అవగాహన సదస్సులో సీపీ రవిశంకర్
- ఆటో డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలు

**బీచ్‌రోడ్డు :** పోలీస్, రవాణా శాఖ, వాహనదారుల సమష్టి కృషితో ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అన్నారు. ఆదివారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రవాణా శాఖ అధికారులు, ఆటో డ్రైవర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యా సంస్థల యజమానులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు చాలా జాగ్రత్తగా వాహనాలను నడపాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో ఆటోలో స్కూళ్లకు పిల్లలను పంపిస్తున్నప్పుడు.. జాగ్రత్తగా వెళ్లాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉందన్నారు. పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించినప్పుడు సమాచారమిస్తే పోలీసులు వచ్చి భద్రతపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా వాహనాదారుల నిర్లక్ష్యం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల వీడియోలను ప్రదర్శించి వాటిలో తప్పుల గురించి అడిగి తెలుసుకున్నారు.





ఆటో డ్రైవర్లకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**పిల్లలను వేగంగా సిద్ధం చేయాలి**

తల్లిదండ్రులు తమ పిల్లలను వేగంగా పాఠశాలలకు సిద్ధం చేయాలని.. తద్వారా సరైన సమయంలో స్కూల్‌కు ఆటో డ్రైవర్ తీసుకొని వెళతారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆలస్యం చేయడం వల్ల ఆటో డ్రైవర్ స్కూల్‌కు సమయం అయిపోతుందని స్పీడ్‌గా డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారినపడిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే చాలా పాఠశాలల్లో సమయమైన వెంటనే గేట్లు క్లోజ్ చేస్తున్నారని.. తద్వారా ఆటో డ్రైవర్లను తిడతారని వేగంగా డ్రైవింగ్ చేస్తున్నారని తెలిపారు. పాఠశాలల యాజమాన్యాలు ఆటోలు ఆలస్యమైనా అనుమతించేలా చూడాలని సూచించారు.

**ఆటో డ్రైవర్ల కోసం ఆలోచించాలి..**

ఇప్పటికిప్పుడు ఆటోలపై కఠిన చర్యలు తీసుకోవడం వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబ పోషణ కష్టమవుతుందని ఆటో సంఘ నాయకులు తెలిపారు. వచ్చే జూన్ నెల నుంచి నిబంధనలను అమలు చేయాలని కోరారు. అలాగే తల్లిదండ్రులు స్కూళ్లకు వేలకు వేలు ఫీజులు చెల్లిస్తున్నారని కానీ ఆటోకు మాత్రం అతి తక్కువ చెల్లించటం వల్ల ఎక్కువ మంది పిల్లలను ఎక్కించాల్సి వస్తుందన్నారు. ఆటోకు చెల్లించే సొమ్ము కొంచెం పెంచటం వల్ల తక్కువ మంది పిల్లలతో ఆటోలో భద్రంగా వెళ్లే అవకాశం ఉంటుందన్నారు.

**ప్రతీ ఆరు నెలలకు వైద్య పరీక్షలు అవసరం**

40 ఏళ్లు పైబడిన డ్రైవర్లు ప్రతీ ఆరు నెలలకు ఒకసారి బీపీ, షుగర్, కళ్ల పరీక్షలు చేసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ సదస్సులో భాగంగా ఆటో డ్రైవర్లకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్య నిపుణులు మాట్లాడుతూ బీపీ, షుగర్ వల్ల ఒక్కో సారి కళ్లు మైకం వచ్చే అవకాశం ఉంటుందని, తద్వారా వాహనాలు అదుపు తప్పి ప్రమాదానికి గురికావటం జరుగుతుందన్నారు. ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్స్ కోసం వేసి చూడకుండా ఏదో ఒక వాహనంలో దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలన్నారు.



తెల్ల పులుల ఎన్‌క్లోజరు వద్ద సందడి చేస్తున్న పిల్లలు

# జూకు కార్తీక శోభ

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం సందడి నెలకొంది. కార్తీక మాసం రెండో ఆదివారం కావడంతో ఆరు వేలకు పైగా జూను సందర్శించినట్లు అధికారులు తెలిపారు. పిల్లలు, పెద్దలు, పలు పాఠశాలల విద్యార్థులు.. వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద గుంపులుగా కనిపించారు. ఏనుగులు, కోతులు, మొసళ్లు, పాములు, చింపాంజీలు, పులులు, సింహాలు, అడవి కుక్కలు, హైనాలు, నెమళ్లు, నిప్పుకోళ్లు, ఈములు సందర్శకులను అలరించాయి. మేటింగ్ కోసం ఎన్‌క్లోజర్‌లో విడిచిపెట్టిన జత సింహాలు హుషారుగా ఒక దాని వెంట మరొకటి పరుగెడుతూ సందర్శకులను కనువిందు చేశాయి. నీటి ఏనుగులు వాటి కొలనులో ఆడుకుంటూ ఆకట్టుకున్నాయి. ఇటీవల ఏర్పాటు చేసిన ఆట పరికరాలు వద్ద పిల్లలు ఎక్కువ సేపు ఆడుకుంటూ గడిపారు. పలు కుటుంబాలు వనభోజనం చేశాయి. జూను ఆదివారం 6,354 మంది సందర్శించారని, వారి ద్వారా రూ.5.30 లక్షల ఆదాయం లభించినట్లు క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. కంబాలకొండ ఎకో టూరిజం పార్కును 550 మంది సందర్శించగా.. రూ.35,000 ఆదాయం లభించిందని సిబ్బంది వెల్లడించారు.



జూలో పక్షుల సందడి



ఎన్‌క్లోజర్‌లో హుషారుగా సింహాలు

## హాకీ టోర్నీలో విజేత రాయచోటి పాఠశాల

విశాఖ స్పోర్ట్స్: పాఠశాలల హాకీ టోర్నీలో రాయచోటి పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం బుల్లయ్య కళాశాల గ్రౌండ్‌లో జరిగిన బాలుర ఫైనల్‌లో రాయచోటి జట్టు 1-0తో ప్రభుత్వ రైల్వే పాఠశాలపై విజయం సాధించింది. సెమీస్‌లో ఇస్లాంపేట ఉన్నత పాఠశాలపై 0-2 రాయచోటి పాఠశాల విజయం సాధించింది. మరో సెమీస్‌లో హోరాహోరీగా సాగిన పోరులో నక్కపల్లి పాఠశాలపై ప్రభుత్వ రైల్వే పాఠశాల ఎక్స్‌ట్రా టైంలో విజయంతో ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలికల ఫైనల్‌లో రాయచోటి పాఠశాల 3-1తో నక్కపల్లి జెడ్పీ స్కూల్‌పై విజయం సాధించింది. సెమీస్‌లో ఇస్లాంపేట పాఠశాలపై రాయచోటి పాఠశాల, రైల్వే పాఠశాలపై నక్కపల్లి జెడ్పీ పాఠశాల విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. 8 బాలుర జట్లు, 4 బాలికల జట్లు ఈ పోటీ ల్లో పాల్గొన్నాయి. ఇన్‌కంటాక్స్ అధికారి మిథిలేష్‌కుమార్ విజేతలకు ట్రోఫీలందించారు. డీఎస్‌ఏ చీఫ్ కోచ్ గాలియట్, ఫ్రెండ్ హాకీ క్లబ్ కార్యదర్శి నియోల్ పాల్గొన్నారు.

### ఓషన్ సెయిలింగ్ రేస్ విజేత ఈఎన్‌సీ

విశాఖ స్పోర్ట్స్: ఇంటర్ కమాండ్ ఓషన్ సెయిలింగ్ రేస్‌లో తూర్పు నావికా దళం బోట్ మొదటి స్థానంలో నిలిచింది. ఈఎన్‌సీకి చెందిన 40 అడుగుల సెయిలింగ్ బోట్ సెయిలింగ్ వెసెల్ నీల్కాంత్ ఓషన్ రేస్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఈఎన్‌సీ బోట్ కెప్టెన్ కమాండర్ వినీత్ దోషి అతని బృందం అసాధారణమైన గ్రిట్, సముద్రయాన నైపుణ్యాలతో ఎత్తయిన సముద్రాలలో ప్రయాణించి ఈనెల 25న నాలుగు నౌకల్లో మొదటిగా గోవా చేరుకున్నారు. ఈ బృందం తమ ప్రయాణంలో 40 అడుగుల ఐఎన్ఎస్‌పి నీలకంఠతోనూ అసాధారణ ప్రదర్శన చేసింది.

## ఎన్నికల విధులకు ఉత్తరాంధ్ర పోలీసుల పయనం

తాటిచెట్లపాలెం: తెలంగాణలో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పోలీసులు ప్రత్యేక రైలులో బయలుదేరారు. ఎన్నికల సిబ్బందితో కూడిన విశాఖపట్నం–హైదరాబాద్(08571) ప్రత్యేక రైలు ఆదివారం రాత్రి విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి బయలుదేరింది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల నుంచి 760 మంది, విశాఖపట్నం సిటీ నుంచి 540 మంది కలిసి మొత్తం 1,300 మంది పోలీసులు, హోంగార్డులు ఈ రైలులో బయలుదేరారు. అక్కడ విధులు ముగించుకుని డిసెంబర్ 1న ఉదయం 9 గంటలకు హైదరాబాద్ నుంచి తిరిగి బయలుదేరుతారు.

## ముగిసిన స్వాభిమాన ఉత్సవాలు

కొమ్మాది: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణా మిషన్ భవన్‌లో నిర్వహిస్తున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాలు (జన జాతీయ గౌరవ్ దివస్) ఆదివారం ఘనంగా ముగిశాయి. రాష్ట్రం వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన గిరిజన కళాకారుల తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముగింపు సందర్భంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్,ఆర్చరీ, జావెలిన్ త్రో, చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాసాల్లో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మిషన్ డైరెక్టర్ రవీంద్రబాబు, కల్నల్ వి.రాములు బహుమతులు అందజేశారు. గిరిజన స్వతంత్ర వీరుడు గామ్ గంటందొర, వీరయ్య దొర గౌరవార్థం ప్రత్యేక కవర్లను ఆవిష్కరించారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చినబాబు పాల్గొన్నారు.

## నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ మేయర్, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

# షాపింగ్‌మాల్‌లో భారీ అగ్ని ప్రమాదం

- రూ.5 కోట్లకు పైగా నష్టం?
- తగరపువలస జశ్వంత్ రడీమేడ్స్ షాపులో ఘటన



జస్వంత్ రడీమేడ్స్ షాపులో ఎగిసిపడుతున్న మంటలు



వివరాలు సేకరిస్తున్న డీసీపీ శ్రీనివాస్, సీఐ రమేష్, తహసీల్దార్ రమేష్, వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్

తగరపువలస: తగరపువలస మెయిన్‌రోడ్డులోని మూడు అంతస్తుల్లో ఉన్న జశ్వంత్ రెడీమేడ్స్ షాపింగ్‌మాల్ ఆదివారం అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో రూ.5 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు సమాచారం. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లలో దుస్తులు, సెకండ్ ఫ్లోర్‌లో యజమాని కటకం సునీత కుటుంబం నివాసం ఉంటోంది. రాత్రి 8.15 గంటలకు షాపింగ్‌మాల్ నుంచి దట్టమైన పొగలు రావడంతో గుర్తించిన స్థానికులు, బాధితులు.. భీమిలి పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. పౌర్ణమి కావడంతో కార్మికవాడలోని పాత ఇంటి వద్ద పూజల కోసం ఆమె కుటుంబ సభ్యులంతా వెళ్లారు. దీంతో సాయంత్రం ఆరు గంటలకే షాపింగ్‌మాల్‌ను మూసివేసినట్టు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. రాత్రి 9.30 వరకు షాపింగ్‌మాల్ నుంచి దట్టమైన పొగ వస్తుండటంతో తగరపువలస, చిట్టివలస ప్రాంతాలను కమ్మేశాయి. తర్వాత మంటలు ఎగసి పడుతుంటడంతో ఏమి జరుగుతుందోనని చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు ఫ్లోర్లలో వ్యాపించిన మంటలు పక్కనే ఉన్న చిట్టివలస లేబర్ యూనియన్ కార్యాలయంతో పాటు కింద ఉన్న మరో రెడీమేడ్ దుస్తుల దుకాణానికి అంటుకున్నాయి. మూడో ఫ్లోర్లలో రెండు గ్యాస్ సిలిండర్లు ఉండగా.. రాత్రి 11 గంటల సమయంలో ఒకటి పేలిందని స్థానికులు తెలిపారు. భీమిలి సీఐ డి.రమేష్, తాళ్లవలస అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి మంటలు అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అర్ధరాత్రి వరకు మంటలు అదుపులోకి రాలేదు. షాపింగ్‌మాల్‌లో కుసుమంచి ట్రేడర్స్‌కు చెందిన రూ.1.20 కోట్ల స్టాక్‌తో పాటు జశ్వంత్ షాపింగ్‌మాల్‌కు చెందిన స్టాక్, ఫర్నీచర్ కలిపి రూ.5 కోట్ల వరకు నష్టం ఉన్నట్టు అంచనా. క్రిస్మస్ కోసం స్టాక్ కూడా ఇటీవలే తీసుకొచ్చినట్లు యజమానులు తెలిపారు. కాగా షాపింగ్‌యాల్ యజమాని మల్లిబాబు మూడేళ్ల క్రితం వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. సంఘటన స్థలాన్ని డీసీపీ శ్రీనివాస్, భీమిలి తహసీల్దార్ రమేష్, వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ తదితరులు పరిశీలించారు.

# మహోన్నతం.. మన రాజ్యాంగం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి



ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ విశ్వనాథన్

డాబాగార్డెన్స్: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు మూలస్తంభమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, జోనల్ కమిషనర్ శివప్రసాద్, కార్యదర్శి నల్లనయ్య, ఏఎంవోహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

మహారాణిపేట: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కుల, మత, జాతి, వర్ణ వివక్ష లేకుండా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ సమన్యాయం అందించడమే భారత రాజ్యాంగం లక్ష్యమన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనదన్నారు. రాజ్యాంగాన్ని అందరూ గౌరవించుకుని బాధ్యత గల పౌరులుగా వెలుగొందుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కె.ఈశ్వరరావు, కలెక్టరేట్‌లో వివిధ సెక్షన్ల అధికారులు పాల్ కిరణ్, రామరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలకనుగుణంగా పాలన

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ కల్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది:అంబేడ్కర్ ఆశయాలకనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలన ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి కోలా గురువులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు పేర్ల విజయచంద్ర, పిల్లా సుజాత, విశాఖ జోనల్ విభాగం ఇన్‌చార్జిలు అల్లంపల్లి రాజబాబు, తుల్లి చంద్రశేఖర్, మారుతీ ప్రసాద్, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షుడు కేవీ బాబా, బొండా ఉమామహేశ్వరరావు, అప్పన్న, బాబ్జీనాయుడు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ముఖ్య నాయకులు శ్రీదేవివర్మ, రామన్నపాత్రుడు, గొలగాని శ్రీనివాస్, నడింపల్లి కృష్ణంరాజు, ద్రోణంరాజు శ్రీవత్సవ, పేడాడ రమణి కుమారి, మోహన్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు జగ్గుపల్లి అప్పలరాజు, బి.ఉమామహేశ్వరరావు, రఘురాజు, సూరిబాబు, రమేష్ , మల్లీశ్వరి, నరేష్ పాల్గొన్నారు.

## తంతడి తీరంలో విద్యార్థి గల్లంతు



రాజేష్ (ఫైల్)

పరవాడ: తంతడి తీరంలో సముద్ర స్నానానికి దిగిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. గల్లంతైన విద్యార్థి పరవాడ బీసీ కాలనీకి చెందిన జంగాల రాజేష్ (14)గా గుర్తించారు. పరవాడ జెడ్పీ పాఠశాల్లో 9 తరగతి చదువుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన పెయింటర్ వి.కల్యాణచక్రవర్తి, ఐటీఐ విద్యార్థి జనపరెడ్డి వినయ్, సీలింగ్ కార్మికుడు సమ్మంగి కిశోర్, పిన్నింటి మోక్షజ్ఞ స్నేహితులతో కలిసి విద్యార్థి రాజేష్ తంతడి తీరంలో సరదాగా గడపడానికి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు వచ్చారు. 4.30 గంటల సమయంలో మోక్షజ్ఞతో కలిసి రాజేష్ సముద్రంలో స్నానానికి దిగారు. స్నానం చేస్తుండగా ఉధృతంగా వచ్చిన అలల తాకిడికి వీరద్దరూ కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న కల్యాణ చక్రవర్తి మోక్షజ్ఞను కాపాడగలిగాడు. రాజేష్‌ను అలలు సముద్రంలోకి ఈడ్చుకుపోయాయి. గల్లంతైన రాజేష్ కోసం పోలీసులు గాలింపు చేపట్టినప్పటికీ ఫలితం దక్కలేదు. రాజేష్ గల్లంతైన విషయాన్ని తల్లిదండ్రులు సత్తిబాబు, సంతోషిలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఉన్న ఒక్కగాని ఒక్క కుమారుడు గల్లంతవడంతో కుటుంబంలో తీరని విషాదం చోటుచేసుకుంది. పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## యాదవులను బీసీ-బీలోకి చేర్చాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు

మద్దిలపాలెం : యాదవులను బీసీ-డీ నుంచి బీసీ-బీలోకి మార్చాలని ఉత్తరాంధ్ర యాదవుల సంఘం డిమాండ్ చేసింది. శివాజీపాలెంలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం యాదవులంతా సమావేశమయ్యారు. ఉత్తరాంధ్ర యాదవుల సమస్యలపై చర్చించారు. సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పరిధిలో యాదవులు పశువుల పోషణ కుల వృత్తిని..రాయసీమలో అదే యాదవులు కురుబ/ కురుములకు సాంఘికంగా, సామాజిక స్థితికి సరిసమానంగా జీవనం సాగిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర యాదవులను బీసీ–డీ నుంచి బీసీ–బీ కేటగిరీని సీరియల్ నం.11 లో చూపిన విధంగా కురుబ/ కురుములకు బదులుగా కురుబ/ కురుము ఉత్తరాంధ్ర యాదవులుగా గుర్తించి ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కోరినట్టు చెప్పారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్‌లు పలు అంశాలపై మాట్లాడారు. సమావేశంలో రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఉత్తరాంధ్ర యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి గొంపా అప్పారావు, ఉత్తరాంధ్ర నాయకులు మాన్యల కృష్ణ, ముచ్చు రామలింగేశ్వరరావు, గడ్డిబోయిన కృష్ణలు పాల్గొని వారి అభిప్రాయాలను వెల్లడించారు.

## వైభవ్ 'విశేష' జ్యువెలరీ ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభం



జ్యువెలరీ కలెక్షన్, ప్రదర్శనను ప్రారంభిస్తున్న పైడా కృష్ణప్రసాద్, పైడా విద్యా సంస్థల అధినేత్రి శారద

సీతమ్మధార: బీచ్‌రోడ్డులోని ది గేట్‌వే (తాజ్) హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వైభవ్ 'విశేష' ప్రివ్యూ అండ్ సేల్ జ్యువెలరీ ప్రదర్శన, అమ్మకాలను పైడా కృష్ణప్రసాద్, పైడా విద్యా సంస్థల అధినేత్రి డా.శారద ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో హ్యాండీ క్రాఫ్ట్, క్యూరేటెడ్ గోల్డ్, యాంటిక్, ఫ్యూజన్, ఫైన్ జ్యువెలరీ డిజైన్లతో పాటు కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా ఆరు సరికొత్త కలెక్షన్లు 'జమ్రుద్, అరేబియా, ప్రిస్మాటిక్, అవతార, బ్లూమ్‌ఫైన్ అండ్ ఇవాల్వ్'లను అందుబాటులో ఉంచినట్లు వైభవ్ చైర్‌పర్సన్ గ్రంధి మల్లికా మనోజ్ తెలిపారు. లైట్ వెయిట్ ఫ్లోరల్, 3డీ, నేచురల్ మ్యాన్‌మేడ్, నిజాం కాలం నాటి ఆభరణాలు ప్రదర్శనలో ఉంచామని, ఇవి ఎంతగానో ఆకర్షిస్తాయని చెప్పారు. ప్రదర్శనను వీక్షించాలని నగర ప్రజలను కోరారు.

## దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత

- ఉపకరణాల పంపిణీ కోసం రేపటి నుంచి గుర్తింపు శిబిరాలు

మహారాణిపేట: జిల్లాలోని దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు ఏడు ప్రాంతాల్లో గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ శిబిరాల్లో గుర్తించిన వారికి అవసరమైన పరికరాలను హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆలిమ్–కో ద్వారా అందజేస్తామన్నారు. ఈ నెల 28 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

| తేదీ | నియోజకవర్గం | వేదిక |
|---|---|---|
| 28 | విశాఖ దక్షిణ | ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల - డాబాగార్డెన్స్ |
| 29 | భీమిలి | చంద్రంపాలెం ఉన్నత పాఠశాల -మధురవాడ |
| 30 | గాజువాక | ప్రభుత్వ ఉన్నత పాఠశాల - గాజువాక |
| 1 | విశాఖ పశ్చిమ | విష్ణు ప్రియ ఫంక్షన్ హాల్ - బుచ్చిరాజుపాలెం |
| 2 | విశాఖ ఉత్తర | పోర్ట్ స్టేడియం ఎదురుగా ప్రభుత్వ ప్రాథమిక పా ఠశాల |
| 3 | -- | ఆర్కే మిషన్ స్కూల్ - ఆర్కే బీచ్ |
| 4 | విశాఖ తూర్పు | స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం-రేసపువానిపాలెం |

# అత్యవసర స్థితిలో మీ స్పందన భేష్

- వెలగ రాజు, రావి వెంకటరావును అభినందించిన సీపీ



రావి వెంకటరావు, వెలగ రాజును అభినందిస్తున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

అల్లిపురం: సంగం శరత్ జంక్షన్ వద్ద ఈ నెల 22వ తేదీ ఉదయం జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను సకాలంలో ఆస్పత్రికి తరలించి.. వారి ప్రాణాలు కాపాడిన వెలగ రాజు, రావి వెంకటరావులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అభినందించారు. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న బస్సులో వెలగ రాజు ఉన్నారు. ప్రమాదం చూసిన వెంటనే బస్సు దిగి తీవ్రంగా గాయపడిన పిల్లలకు సాయం చేస్తున్నారు. అదే సమయంలో సిగ్నల్స్ వద్ద ఉన్న రావి వెంకటరావు తన కారులో వెలగ రాజుతో కలసి చిన్నారులను సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో చేర్పించారు. మానవతా దృక్పథంతో స్పందించిన వారిని సీపీ ఆదివారం తన కార్యాలయంలో అభినందించి.. ప్రశంసాపత్రాలు అందజేశారు.

## హ్యాపీ బర్త్‌డే దళపతి



దళపతికి ఆహారం అందిస్తున్న యానిమల్ కీపర్

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో జూనియర్ దళపతికి ఆదివారం పుట్టినరోజు వేడుకలు జరిపారు. జూలో మగ నీటి ఏనుగు పేరు జూనియర్ దళపతి. ఇది 2017, నవంబరు 26న జూలో జన్మించింది. పద్మ గర్భంలో ఉండగానే తండ్రి నీటి ఏనుగు మృతి చెందింది. పద్మ ప్రసవం అనంతరం జూ అధికారులు నీటి ఏనుగుకు జూనియర్ దళపతిగా నామకరణం చేశారు. ఆదివారంతో ఆరేళ్లు పూర్తవడంతో నీటి ఏనుగు ఎన్‌క్లోజరు వద్ద అధికారులు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. జూ క్యూరేటర్ నందనీసలారియా సందర్శకులతో కలిసి కేకు కట్‌చేశారు. అనంతరం పండ్లను జూనియర్ దళపతికి యానిమల్ కీపరు తినిపించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆంధ్రా బాహుబలిగా భాస్కరరావు

మిస్టర్ ఆంధ్రా 27వ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్–2023 పోటీల్లో విజేతగా విశాఖపట్నానికి చెందిన బాడీ బిల్డర్ గిడ్డి భాస్కరరావు నిలిచాడు. యలమంచిలి పట్టణంలోని పంచముఖి హనుమాన్ ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఈ పోటీలు జరిగాయి. – యలమంచిలి